
www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 27 అక్టోబర్ 2024

5

తిరుపతి



డిఇఒ కెవిఎన్ కుమార్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



తిరుపతి జిల్లా నూతన జిల్లా విద్యాశాఖ అధికారి కెవిఎన్ కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను యుటిఎఫ్, ఎస్‌టియు సంఘాల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశాయి. ఈ సందర్భంగా కెవిఎన్ కుమార్ మాట్లాడుతూ విద్యా ప్రమాణాల పెంపుకు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు, క్షేత్రస్థాయి అధికారులు సమన్వయంతో సంఘటితంగా కృషి చేసి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపడానికి సహకరించాలని కోరారు. ఆయనను కలిసిన వారిలో ఎస్‌టియు రాష్ట్ర నేత గాజుల నాగేశ్వరరావు ఉన్నారు.

కళాశాలల మధ్యలో...

మద్యం షాపులొద్దు : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఎంఆర్‌పల్లి సర్కిల్లో ఉన్న మద్యం షాపును తొలగించాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు షాపు ఎదుట శనివారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతికి అత్యధిక షాపులు కేటాయించడం సిగ్గుచేటన్నారు. ఎంఆర్ పల్లి సర్కిల్లో ఏర్పాటు చేసిన మద్యం షాపు చుట్టుపక్కల దాదాపు 20 కళాశాలలు ఉన్నాయని, దాదాపు 20వేల మంది విద్యార్థులు ఆయా చుట్టుపక్కల కళాశాలల్లో చదువుతున్నారన్నారు. ప్రతిరోజూ విద్యార్థులు ఆ సర్కిల్‌నుంచే కళాశాలకు వెళ్లే సమయంలో తాగుబోతులు విద్యార్థులపై దాడిచేసే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ కాలేజీలు కూడా అక్కడ ఉన్నాయని, ఆయనకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఈ సమస్యపై స్పందించి అక్కడున్న మద్యం షాపును తొలగించాలని, లేకుంటే వేలాది మంది విద్యార్థులతో కలిసి రెండు రోజుల్లో ఆ షాప్‌ను ధ్వంసం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎక్సైజ్ సీఐ రామచంద్రకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అక్బర్, రవి, ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత, నాయకులు అశోక్, వినోద్, నరేంద్ర, తేజ, వీరేష్, హర్షద్ పాల్గొన్నారు.



మద్యం షాపు వద్దంటూ విద్యార్థుల నిరసన

టీ దుకాణంపై మందుబాబుల దాడి

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి)

మండలంలోని పాకాలవారి పల్లి వద్ద ఉన్న టోల్ ప్లాజా దగ్గర తాటి బెల్లం టీ దుకాణం పై మందుబాబులు శుక్రవారం అర్ధరాత్రి మద్యం మత్తులో బీభత్సం సష్టించి దాడి చేశారు. శుక్రవారం రాత్రి ఫుల్ గా మద్యం సేవించిన నలుగురు వ్యక్తులు తాటి బెల్లం టీ స్టాల్ వద్దకు వచ్చి టీ తాగారు. టీకి నగదు చెల్లించమని అడిగినందుకు మందుబాబులు కర్రలు, రాడ్లతో విచక్షణ రహితంగా దుకాణం, అక్కడ ఉన్న వ్యక్తులపై దాడి చేశారు. ఈ దాడిలో దుకాణంలో ఉన్న దీపక్, చేతన్, ఉదయ్ లకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తులను చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. దుకాణంలోని సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దశ్యాలను పరిశీలించి దాడి చేసిన వారు పాకాలకు చెందిన పాంత్ర దిలీప్ నాయుడు, మనోజ్ , గౌతమ్ ,దినేష్ గా చంద్రగిరి పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సర్కస్ ఇన్స్పెక్టర్ సుబ్బరామిరెడ్డి తెలిపారు.

తిరుపతికి తలమానికం తుడా టవర్స్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్



తిరుపతికి తలమాణికం తుడా టవర్స్ అని, వేలం నిర్వహించి 2026, మార్చి 31 కల్లా తుడా టవర్స్ నిర్మాణాలు పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య అన్నారు. నగరంలోని రాయలచెరువు రోడ్డులో తుడా ఆధ్వర్యంలో నిర్మిస్తున్న తుడా టవర్స్ నిర్మాణ పనులను ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య శనివారం ఇంజినీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. అనంతరం తుడా కార్యాలయంలో అధికారులతో సమావేశమై సమీక్షించారు.ఈ సందర్భంగా ఎన్.మౌర్య సమావేశంలో మాట్లాడుతూ తుడా టవర్స్ ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా 3.6 ఎకరాల స్థలంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నామని అన్నారు. ఇందులో గ్రౌండ్ ఫ్లోర్ తో పాటు 13 అంతస్థులతో తుడా టవర్స్ నిర్మిస్తున్నామని అన్నారు. 2025, మార్చి లోపు అన్ని పనులు పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని అన్నారు. విస్తతంగా ప్రచారం చేసేందుకు నూతనంగా బ్రోచర్ తయారు చేయించామని, ఇందులో అన్ని వివరాలు పొందుపరిచామని అన్నారు. కార్యదర్శి వెంకటనారాయణ, సూపరింటెండెంట్ ఇంజినీర్ కష్ణారెడ్డి, సలహాదారులు రామకష్ణ రావు, ఈఈ రవీంద్రయ్య, కె.పి.సి సంస్థ ఈ.డి.సుశీల్ కుమార్ ఉన్నారు.

ప్రజాపోరాటాలు వర్ధిల్లాలి..

- సిపిఎం మహా ప్రదర్శన
- ప్రజలపై భారాలు తగ్గించాలి: సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రమాదేవి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

సిపిఎం చిత్తూరు జిల్లా 14వ మహాసభ సందర్భంగా శనివారం చిత్తూరు నగరంలో మహా ప్రదర్శన జరిగింది. ఈ మహా ప్రదర్శన రైల్వేస్టేషన్ దగ్గర ప్రారంభమై గాంధీ సర్కిల్, ఎమ్మెస్సార్ సర్కిల్ మీదుగా డీఈఓ ఆఫీస్ వరకు జరిగింది. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి మాట్లాడుతూ ఎన్నికలక ముందు సూపర్ సిక్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం నాలుగు నెలలు పూర్తవుతున్నప్పటికీ హామీలు అమలు చేయకపోవడం దారుణమన్నారు. గత ప్రభుత్వం ప్రజా ఉద్యమాల మీద ప్రజా సమస్యను పరిష్కారం చేయకుండా ఉక్కుపాదం మోపినప్పుడు ప్రజలు కార్మికులు తిరగబడి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనపారని గుర్తు చేశారు. కొత్త ప్రభుత్వం వస్తే సమస్యలు



ప్రదర్శనలో రాష్ట్ర నాయకులు

పరిష్కారం అవుతాయని ఆశించిన పేదలకు నిరావే మిగిలిందన్నారు. ఉచిత ఇసుక పాలసీ పేదలకు భారంగా మారింది. మద్యం మహిళలు పాలిట శాపంగా మారిందన్నారు. ఇష్టారాజ్యంగా నివాసాల మధ్య మద్యంషాపులు పెడుతూ మహిళలపై దాడులు జరిగే విధంగా ప్రభుత్వమే ప్రోత్సహిస్తున్నట్లుగా ఉందని విమర్శించారు. ప్రభుత్వ విధానాలపై ఎర్రజెండా నిరంతరం పోరాటం చేస్తూ ప్రజల పక్షాన నిలిచిందని తెలిపారు. ప్రజలందరూ కూడా సిపిఎం ప్రజా పోరాటాలను బలపరచాలని పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం లౌకికదేశంలో అనేక కులాలు, మతాలు ఉంటే ఒకే మతం ఉండాలని చిచ్చు పెడుతూ అధికారాన్ని కొనసాగిస్తున్నారని, ఈ ప్రభుత్వాన్ని మూడోసారి మెజార్టీ రానీయకుండా ప్రజలు తిరస్కరించాలని కోరారు. ఇతరుల మద్దతుతో అధికారం చేపడుతూ ప్రజలపై భారాలు మోపడం దుర్మార్గమన్నారు. ఈ మతోన్మాద బీజేపీ ప్రభుత్వాన్ని భవిష్యత్తులో ఎండగట్టి ప్రజలకు అనుకూలమైన ప్రభుత్వాలు వచ్చే విధంగా ప్రజలు పోరాటాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చిత్తూరు జిల్లాలో దళితుల మీద దాడులు జరిగినప్పుడు సిపిఎం అండగా నిలబడిందన్నారు. మహిళలపై దాడులు చేస్తే సిపిఎం తప్ప ఇతర పార్టీలు మాట్లాడలేని పరిస్థితి ఉందన్నారు. ఈ మహాసభల్లో భవిష్యత్తు పోరాటాలకు పదును పెడతామన్నారు. సభలో సిపిఎం మాజీ జిల్లా కార్యదర్శి చల్లా వెంకటయ్య, జిల్లా నాయకులు సురేంద్రన్, ఓబుల్ రాజు, గిరిధర్ గుప్తా, భువనేశ్వరి, స్కీన్ వర్కర్లు, జానపద వృత్తి కళాకారులు పాల్గొన్నారు.

సంఘమిత్రకు 'సీఐటీయూ'పరామర్శ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

అధికార పార్టీ నేతల వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రేవతిని సీఐటీయూ నాయకులు పరామర్శించారు. కూటమి ప్రభుత్వంలో చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు ఎక్కువయ్యాయనీ, ముఖ్యంగా దళితులు ఉద్యోగాలు కోల్పోతున్నారంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగినా నేతలకు, అధికారులకు ఏమాత్రం పట్టలేదని జిల్లా కార్యదర్శి గురవయ్య మండిపడ్డారు. ఫలితంగానే సంఘమిత్రలు, అంగన్వాడీలు అధికార వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా కూటమి ప్రభుత్వ నేతల్లో మార్పు రావాలని కోరారు. రేవతికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గంధం మణి, వెంకటేష్ పాల్గొన్నారు.

టీటీడీలో ఘనంగా ఆయుధపూజ

ప్రజాశక్తి -తిరుమల

తిరుపతిలోని టీటీడీ రవాణా విభాగం, ముద్రణాలయాల్లో శనివారం ఆయుధపూజ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో టీటీడీ ఈవో జె.శ్యామలరావు, జేఈవో గౌతమి, సీవీఎస్వో శ్రీధర్ పాల్గొని శ్రీవేంకటేశ్వర స్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా టీటీడీ రవాణా విభాగంలో జరిగిన పూజా కార్యక్రమంలో పాల్గొన్న అధికారులకు ట్రాన్స్పోర్ట్ జీఎం శేషారెడ్డి ఘన స్వాగతం పలికారు. ముద్రణాలయ ప్రత్యేక అధికారి రామరాజు ఈవో, ఇతర అధికారులను సత్కరించి ఆఫ్ సెట్, ప్రింటింగ్, బైండింగ్ తదితర యంత్రాల పనితీరును అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమాల్లో టీటీడీ డీఎల్ఓ వరప్రసాదరావు, డిప్యూటీ ఈవోలు గోవింద రాజన్, దేవేంద్ర బాబు, గుణ భూషణ్ రెడ్డి, శివ ప్రసాద్, చీఫ్ పీఆర్వో డాక్టర్ టి.రవి పాల్గొన్నారు.

రాజధాని చుట్టూ ఎన్ని ఎకరాలు కొన్నారు? : చింతామోహన్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రాజధాని అమరావతి చుట్టూ విఐపిలు, మంత్రులు ఎన్నెన్ని ఎకరాలు, పొలాలు కొన్నారో ఆ వివరాలను వెల్లడించాలని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ ప్రశ్నించారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట జరిగిన ధర్నా కార్యక్రమంలో చింతామోహన్ మాట్లాడుతూ అమరావతి నిర్మాణానికి 50వేల ఎకరాలు ఎందుకని ప్రశ్నించారు. దేశ రాజధాని ఢిల్లీ కట్టడానికి 17వేల ఎకరాల్లో పూర్తి చేశారన్నారు. కుమారుడు లోకేష్ అమెరికాకు అపుడపుడు వెళుతున్నాడని, అమెరికాలోని న్యూయార్క్ సిటీ 14వేల ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారన్నారు. హడ్కో దగ్గర 12వేల కోట్ల రూపాయలు అప్పు తెచ్చారని, ఎంత వడ్డీకి తెచ్చారో చెప్పాలన్నారు. తిరుపతి పుణ్యక్షేత్రంలో 7,008 మంది నిరుపేద మహిళలకు నాలుగు లక్షల రూపాయలతో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కాంగ్రెస్ పార్టీ ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోపి గౌడ్, రవి, రావణ్, తేజోవతి, శాంతి యాదవ్, ముని శోభ, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముందు జాగ్రత్తలతోనే మంచి దిగుబడులు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

వరి సాగులో ముందు జాగ్రత్తలు, మెలకువలు పాటించి మంచి దిగుబడులు పొందవచ్చునని వ్యవసాయ జిల్లా వనరుల కేంద్రం జిల్లా ట్రైనింగ్ కోఆర్డినేటర్ భాస్కరయ్య అన్నారు. డక్కిలి మండలం మాధవయ్య పాలెం గ్రామంలో ఆయన రైతులకు శిక్షణ ఇచ్చారు. వరి నారు పెరికే వారం రోజుల ముందు 5 సెంట్ల నారుమడికి ఒక కిలో కార్బో ఫిరాన్ 3 జీ గుళికలు వేసి నీరు పెట్టి నారుమడిలో నీరు ఇంకేటట్లు చేయాలని కోరారు.పొలంలో వరి నాట్లు వేసేటప్పుడు 2 మీటర్ల దూరంలో దారులు వదలాలని, ఇవి మొక్కలకు గాలి, వెలుతురు బాగా సోకేటట్లు సహాయ పడతాయని తెలిపారు.ఉద్యాన అధికారి ఆనంద రెడ్డి, జిల్లా వనరుల కేంద్రం ఏఓ వేణుగోపాలరావు, మండల వ్యవసాయ అధికారి విజయభారతి, గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీను పాల్గొన్నారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలి : జడ్జి రాఘవేంద్ర

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌సి రాఘవేంద్ర అన్నారు. శనివారం గోపాలకృష్ణాపురం అంబేద్కర్ గురుకుల వసతిగృహాన్ని ఆయన అకస్మాత్తుగా తనిఖీలు నిర్వహించారు. విద్యార్థులకు అందించే భోజనం నాణ్యత పెంచాలనానరు. మరుగుదొడ్లను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వసతి గృహంలో సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రకళ, ఉపాధ్యాయులు, న్యాయవాదులు మురుగేషన్ రెడ్డి, గాలి సురేష్ బాబు పాల్గొన్నారు.



విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు



విద్యుత్ ఛార్జీల భారాలను నిరసిస్తూ సిపిఎం ధర్నా

విద్యుత్ ఛార్జీల భారాన్ని ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

పెంచిన విద్యుత్ ఛార్జీల భారాన్ని తక్షణమే రద్దు చేయాలని సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు వందవాసి నాగరాజు, పి.మురళి డిమాండ్ చేశారు. వామపక్షాల ఆధ్వర్యంలో తిరుపతి లీలామహల్ పక్కన ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగర కార్యదర్శులు టి.సుబ్రమణ్యం, విశ్వనాథం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వందవాసి నాగరాజు, పి.మురళి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలలకే మోత మోగిస్తోందన్నారు. అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ప్రకటించిన టిడిపి కూటమి ప్రభుత్వం 6072 కోట్ల భారాన్ని మోపిందన్నారు. ఇప్పటికే అధిక ధరలతో సతమతమవుతున్న సామాన్య ప్రజానీకానికి ఇది పెనుభారం అవుతుందన్నారు. డిస్కంలో 8,114 కోట్లు ప్రతిపాదిస్తే అందులో 2042 కోట్లు తగ్గించి ఉపశమనం కలిగించినట్లు ఏపీఆర్సి పేర్కొనడం గమనార్హం అన్నారు.స్మార్ట్ మీటర్ల కొనుగోళ్ల పేరుతో గత ప్రభుత్వం అనుసరించిన తప్పుడు విధానాన్ని ఈ ప్రభుత్వం కొనసాగించడం దుర్మార్గం అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు జయచంద్ర, సాయి లక్ష్మి, బాలసుబ్రమణ్యం, ఆర్ లక్ష్మి, కె వేణుగోపాల్, పి. బుజ్జి, ఎం నరేంద్ర, చిన్న బాబు, హేమలత, సిపిఐ నాయకులు చిన్నం పెంచలయ్య, ఉదయ్, కేవైరాజా పాల్గొన్నారు.

అదనంగా భరించాల్సిందే : సిఐటియు

2024-25 ఆర్థిక సంవత్సరపు సర్దుబాటు ఛార్జీలను 2026-27లో అదనంగా మోయాల్సిందేనని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల వాగ్దానానికి భిన్నంగా టిడిపి కూటమి విద్యుత్ ఛార్జీలను 44 శాతం పెచండాన్ని ఖండించారు. ప్రైవేట్ పెట్టుబడులకు దాసోహమై పీక్ లోడ్ పేరుతో యూనిట్ రూ.8కి కొంటున్నారని విమర్శించారు. విద్యుత్ ప్రైవేటీకరణను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు.

కేశవరెడ్డి విద్యార్థులు రాష్ట్రస్థాయి యోగాకు ఎంపిక

ప్రజాశక్తి - రేణిగుంట

కేశవరెడ్డి ఇంగ్లీష్ మీడియం స్కూలు మామండూరు విద్యార్థులు నితిన్‌రెడ్డి (7వ తరగతి), అబూబకర్ (7వ తరగతి) విద్యార్థులు ఈనెల 25వ తేదీ శ్రీకాళహస్తిలో జరిగిన ఎస్‌జిఎఫ్ జిల్లాస్థాయి యోగా పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. నవంబర్ మాసంలో నెల్లూరులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల ఫౌండర్ కేశవరెడ్డి వారిని అభినందించారు.

ఎస్వీ మ్యూజియం అభివృద్ధి పనులు పరిశీలన

ప్రజాశక్తి -తిరుమల

తిరుమలలోని ఎస్వీ మ్యూజియంలో జరుగుతున్న అభివృద్ధి పనులను టీటీడీ అడిషనల్ ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి శనివారం పరిశీలించారు. పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో ఆరా తీశారు. వేగవంతంగా పనులు పూర్తి చేసి మ్యూజియాన్ని భక్తుల సందర్శనకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. టీటీడీ మ్యూజియం ఆఫీసర్ విజయలక్ష్మీ, డిప్యూటీ ఈవో (హెల్త్) ఆశాజ్యోతి, ఈఈ-1 సుబ్రహ్మణ్యం, డీఈ చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీ గోశాల తనిఖీ

తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర గోశాలను శనివారం సాయంత్రం టీటీడీ ఈవో జె.శ్యామలరావు జేఈవో గౌతమితో కలిసి తనిఖీ చేశారు. ముందుగా తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలోని ఈవో ఛాంబర్ లో గో సంరక్షణ శాల డైరెక్టర్ డాక్టర్ హరినాథ రెడ్డి గోశాల కార్యాకలాపాల పై వివరంగా పీపీటీ ఇచ్చారు. మొత్తం ఐదు గోశాలలోని పశువుల సంఖ్య, దాణా మిక్సింగ్ ప్లాంటు, అగరబత్తిల యూనిట్, నెయ్యి ట్యాంకర్లు, గుడికో గోమాత వంటి కార్యాకలాపాలను ఈవో సమీక్షించారు.

ప్రజా'దృష్టి'

ఇసుక 'మరక'లు..!

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ఇసుక నిర్మాణాలకు అత్యంత అవసరమైంది. ఇదే అక్రమ రవాణాదారులకు ప్రధాన ఆదాయ వనరుగా మారింది. ప్రభుత్వాలు ఏవైనా, పాలకులు ఎవ్వరైనా ప్రకృతి సంపదను కొల్లగొట్టడంలో ఎవరికి వారే ఘనాపాటీలు. నదీ తీరాలు, వాగులు, వంకలే కాదు ఆఖరికి పంటపొలాల్లోనే అక్రమ తవ్వకాలు పెచ్చరిల్లుతున్నాయి. పగటిపూట అక్రమ రవాణా కాస్త తక్కువుగా ఉన్నా మసకమసక చీకట్లో అక్రమ రవాణా వేగంగా జరుగుతుంది. దాన్ని ఎవ్వరు ప్రశ్నించిన, ఎవ్వరు అడ్డుగా వచ్చినా చంపేందుకూ వెనకాడడం లేదు. ఆ కోవలోదే ఈ నెల 23వ తేది రాత్రి ఇసుక లారీ ప్రమాదంలో మరణించిన తండ్రికొడుకుల కథ కావడం గమనార్హం.

గత ప్రభుత్వ అండదండలతో కొంత మంది జిల్లా వ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణాను ఉధృతం చేశారు. కొత్త ప్రభుత్వం కొలువు దీరి నాలుగు నెలలు కాకముందే అధికార పార్టీ అండదండలతో అక్రమదారులు మరింత విజృంభిస్తున్నారు. అటు అధికారుల చలువతో ప్రతిపక్ష పార్టీలు, ప్రత్యార్థులకు చిక్కకుండా వెళ్లేందుకు అక్రమ రవాణ వాహనాలను అత్యంత వేగంగా తీసుకెళ్లుతుంటారు. అయితే అక్రమ రవాణాకు ఏ మాత్రం సంబంధం లేని ఓ నిరుపేద కుటుంబం బలైంది. తొట్టంబేడు మండలం చియ్యవరం గ్రామానికి చెందిన కంచి రాజేంద్ర దంపతులు కుమారుడు చైతన్యకు జ్వరం రావడంతో శ్రీకాళహస్తికి వెళ్లి వైద్యం చేయించుకుని తిరిగి ద్విచక్ర వాహనంపై ఇంటికి పయనమయ్యారు. దారిలో దొమ్మరపాళెం సమీపంలో వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన ఇసుక లారీ వారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో జ్వర్వంతో బాధపడుతున్న చైతన్య, తండ్రి రాజేంద్ర అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. ఎనిమిదేళ్ల కిందట ఇసుకాసురుల దాష్టికానికి బలైన కుటుంబాల్లో ఇప్పటికీ కారు చీకట్లు, కన్నీటి సుడులు తిరుగుతూనే ఉన్నాయి. ఒక దుర్ఘటన... ఒకరు కాదు... ఇద్దరు కాదు ఏకంగా 16 మంది ప్రాణాలను బలితీసుకుంది. ఊరు వల్లకాడును తలపించింది. మరి కొంత మందిని శాశ్వత వైకల్యానికి గురి చేసింది. వీరంతా నేటికీ దయనీయ పరిస్థితుల్లో బతుకుబండి లాగుతున్నారు. గతంలో జరిగిన ఈ భారీ ఘటనకు ఇసుకాసురులే కారణం అన్న విషయం జగమెరిగిన సత్యం. ఏర్పేడు మండలంలోని మునగలపాళెం, చుట్టుపక్కల ఉన్న మరికొన్ని గ్రామాలకు చెందిన చిన్న, సన్నకారు రైతులు, స్వర్ణముఖినదిలో ఇసుక తవ్వకాలను యథేచ్ఛగ సాగుతున్నాయని, దీంతో భూగర్భ జలాలు అడుగంటి పంటలకు సాగునీరందడం లేదని తహశీల్దారుకు విన్నవించేందుకు ఏర్పేడు తహశీల్దారు కార్యాలయానికి 2017 ఏప్రిల్ 21న రైతులు తరలివచ్చారు. అక్కడ తహశీల్దారు లేకపోవడంతో వేచి ఉన్నారు. పక్కనే ఉన్న ఏర్పేడు పోలీసు స్టేషన్‌కు జిల్లా ఎస్పి జయలక్ష్మీ వచ్చారని తెలిసి, ఆమెకు తమ గోడు చెప్పుకోవాలని 30 మంది రైతులు పోలీసు స్టేషన్‌కు వెళ్ళారు. అయితే పోలీసులు వారిని స్టేషన్‌లోకి రానీయకుండా రోడ్డుపైనే నిలబెట్టారు. ఎస్పి తిరుపతికి తిరిగి వెళుతూ రైతులను చూసి, సిఐ సాయినాథ్‌ను కలవాలని సూచించారు. ఆయన్ను కలిసేందుకు స్టేషన్ బయట వేచి ఉన్న రైతులపై లారీ రూపంలో మృత్యుశకటం దూసుకొచ్చింది. క్షణాల్లో ఆ రైతుల ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. ఈ దుర్ఘటనలో 16 మంది రైతులు ప్రాణాలు విడిచారు. 21 మంది తీవ్రగాయాలతో క్షతగాత్రులుగా మిగిలడం బాధాకరం. నాడు ఏర్పేడు, నేడు దొమ్మరపాళెం... ఇలా ఇసుకాసురుల దాహానికి అమాయకులైన ప్రజలు బలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా, ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసి, ఇటు ప్రజల ప్రాణాలు, అటు ప్రకృతి సంపదను కాపాడి, భూగర్భజలాలు పెంపుకు కృషి చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వాలే వేరు.. మాఫియా ఒక్కటే..!

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ప్రభుత్వాలు వేరైనా..ఇసుక, మట్టి మాఫియా ఒకటేనని కార్మిక సంఘాల నాయకులు అన్నారు. వారంతా సిండికేట్లు కావడంతోనే ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా 'మూడు పువ్వులు.. ఆరు కాయలు'గా తమ మాఫియా సామ్రాజ్యాన్ని విస్తరిస్తున్నట్లు స్పష్టం చేశారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జరుగుతున్న ఇసుక మాఫియాకు వ్యతిరేకంగా సిఐటియు కార్యాలయంలో కార్మిక సంఘాల నాయకులు శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సిఐటియు జిల్లా నాయకులు అంగేరి పుల్లయ్య, పెనగడం గురవయ్య, ఏఐటీయూసీ ఏరియా అధ్యక్షులు వైఎస్ మణి సంయుక్తంగా మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని తొట్టంబేడు మండలంలో ఇసుక, మట్టి మాఫియా పేట్రేగిపోతోందన్నారు. కొందరు నాయకులు పార్టీలతో సంబంధం లేకుండా సిండికేట్ గా ఏర్పడి తెల్ల బంగారాన్ని దోచేస్తున్నారని మండిపడ్డారు. ఇసుక మాఫియా దాహానికి తొట్టంబేడు మండలంలోనే ఇప్పటివరకు నలుగురు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాలు కోల్పోయిన కంచి రాజేంద్ర, చైతన్య కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్ గ్రేషియా, రెండెకరాల సాగుభూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న ఇసుక, మట్టి మాఫియాకు వ్యతిరేకంగా కరపత్రాలను విడుదల చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య, గంధం మణి, కుమార్, వెంకటేష్,



అన్వర్ బాషా, వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ నాయకులు జనమాల గురవయ్య, పీడీఎస్యూ నాయకులు జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్ర కుటుంబాన్ని ఆదుకోండి

దొమ్మరపాళెం వద్ద ఇసుక ట్రాక్టరు ప్రమాదంలో దుర్మరణం చెందిన కంచి రాజేంద్ర కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ప్రముఖ సంఘ సేవకులు, కలవగుంట భరత్ రెడ్డి డిమాండు చేశారు. శనివారం ఆయన చియ్యవరం వెళ్లి రాజేంద్ర భార్య గురవమ్మను పరామర్శించి ఓదార్చారు. స్వర్ణముఖినది నుంచి ఇసుక అక్రమంగా తరలిపోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.


తిరుమలలో భక్తుల కోసం పరిశుభ్రమైన గదులు

తిరుమల 'స్వచ్ఛత'కు భరోసా

340మందితో పారిశుద్ధ్య నిర్వహణ

ప్రజాశక్తి -తిరుమల



తిరుమల శ్రీవారి దర్శనానికి నిత్యం వేలాదిమంది విచ్చేసి మంచి దర్శనం, తలనీలాలు సమర్పణ, విశ్రాంతి కోసం పరిశుభ్రంగా వుండే గది కావాలని ప్రతి భక్తుడూ తలుస్తాడు. రాజకీయ ప్రముఖుల సిఫారసులతో విచ్చేసే వారికి టిటిడి ప్రత్యేకంగా కొన్ని గదులను రిజర్వ్ చేసి ఉంచుతుంది. ఇందులో భాగంగా వచ్చే భక్తులు కౌస్తుభం, పాంచజన్యం, నందకం గదులను ప్రత్యేకంగా కేటాయిస్తారు. ఈ గదుల పారిశుద్ధ్యం నిర్వహణకూ పెద్దపీట వేస్తారు. ఈ నిర్వహణకు బెంగుళూరుకు చెందిన ప్రముఖ కంపెనీ 'స్వచ్ఛత' కార్పొరేషన్‌కు కేటాయించారు. స్వచ్ఛత కార్పొరేషన్ టిటిడి సేవే భాగ్యంగా విధులు నిర్వహిస్తోంది. దాదాపు 340 మంది కార్మికులకు ప్రతి నెలా సకాలంలో వేతనాలు అందిస్తూ సేవలు నిర్వహిస్తుండగా... భక్తుల నుండి పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించి ప్రశంసలు అందుకుంటుంది. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో గదులు పారిశుధ్యం నిర్వహణ పెద్ద కష్టమే...అయితే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా గదులు శుభ్రపరిచి మన్ననలు పొందారు. రెండు షిఫ్ట్ లుగా కార్మికులు సేవలందించారు...టిటిడి కూడా కార్మికులకు ప్రశంసించింది.

గదులు శుభ్రంగా ఉన్నాయ్ : శ్రీనివాస్, రామచంద్ర, బెంగళూరు, చెన్నయ్

టిటిడి నిర్వహణ చాలా బాగుంది. గదులు శుభ్రంగా ఉన్నాయి. ఇలాగే కొనసాగాలని ఆశిస్తున్నాం. మేము కుటుంబ సమేతంగా ప్రతి ఏడాదీ వస్తాం. ఎపుడు తిరుమలకు వచ్చిన గదులు అంతే శుభ్రంగా ఉంటాం. పారిశుధ్య కార్మికులను ఈ విషయంలో మెచ్చుకోవాల్సిందే.

రాష్ట్ర కబడ్డీ పోటీలకు పిఆర్ మంగళం విద్యార్థి


రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థి సెల్వినస్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు పిఆర్ మంగళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8 వ తరగతి విద్యార్థి సెల్విన్ సెల్వినస్ ఎంపికయ్యారు. నవంబర్‌లో బాపట్లలో నిర్వహించనున్న 14 ఏళ్ల లోపు విభాగం రాష్ట్ర కబడ్డీ పోటీలలో ఈ విద్యార్థి పాల్గొంటారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్ర శేఖర్ శెట్టి శనివారం తెలిపారు. పుత్తూరు ఎస్ ఆర్ఎస్ పాఠశాలలో 14 ఏళ్లలోపు విద్యార్థుల విభాగంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థి సెల్విన్ సెల్వినస్ విజేతగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎన్నికయ్యా డని పేర్కొన్నారు. సెల్విన్ సెల్వినస్‌ను ఆయన అభినందించారు. రాష్ట్ర స్థాయిలోనూ ప్రతిభ కనబరిచి పతకం సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా సెల్విన్ సెల్వినస్‌ను చంద్ర, పీడీ నందకుమార్, శివ ప్రసాద్, రామ్మోహన్, మోహన్, సురేష్, రవి, శంకరమ్మ, షీలా, చండీశ్వరి,అమరాజబేగం అభినందించారు.

అభివృద్ధి పనులపై దృష్టి సారించాలి: ఎంపిపి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : మండలంలో అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని ఎంపిపి గురవయ్య పేర్కొన్నారు. గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి గురవయ్య ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సాధారణ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై చర్చించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలని ఎంపిపి ఆదేశించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి ఇంద్రాణి, ఎంపీడీవో మధుసూదన్ రావు, తహశీల్దారు చంద్ర శేఖర్, పిఆర్ ఏ ఈ వెంకటేశ్వర్లు, పలు శాఖల అధికారులు, ఎంపిటిసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

డిఈఓకు సన్మానం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన కెవిఎన్ కుమార్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ (అప్సా) రాష్ట్ర అధ్యక్షులు సుబ్రహ్మణ్యం రాజు ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అప్సా తిరుపతి జిల్లా అధ్యక్షులు రమేష్ బాబు, కార్యదర్శి లోకేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా డాక్టర్ బి చంద్రమౌళి శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేస్తున్న పుత్తూరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి ఈ 31వ తేదీ ఉద్యోగ విరమణ చేశారు. అప్పటి నుండి డాక్టర్ కోటేశ్వరయ్య ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం విశాఖపట్నం వియస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర అధ్యాపకులుగా పనిచేస్తున్న డాక్టరు బి చంద్రమౌళి ఉద్యోగోన్నతి పొంది పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకే ఐదు సంవత్సరాల క్రితం ఆయన అధ్యాపకులుగా పని చేశారు. కడప జిల్లా రైల్వేకోడూరు వీరి స్వస్థలం. అనంతరం నూతన ప్రిన్సిపాల్ కు కళాశాల అధ్యాపకులు స్వాగతం పలికి ఘనంగా శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల అభివృద్ధిలో అధ్యాపకుల సహకారంతో కృషి చేస్తానని నూతన ప్రిన్సిపాల్ కోరారు. ఈ కార్యక్రమంలో కోటేశ్వరయ్య, వి వీరయ్య, టి నరసింహులు, డాక్టరు వెంకటకృష్ణయ్య, డాక్టరు కోటేశ్వర రావు, డాక్టరు కందెరి శ్రీదేవి, అధ్యాపకేతరులు పాల్గొన్నారు.

కళ్యాణ వెంకన్నను దర్శించుకున్న రామకృష్ణ

ప్రజాశక్తి -రామచంద్రాపురం(చంద్రగిరి): మండలంలోని శ్రీనివాస మంగాపురం కళ్యాణ వెంకటేశ్వరుని నందమూరి రామకృష్ణ దర్శించుకున్నారు. శనివారం కళ్యాణ వెంకన్న దర్శనం కోసం విచ్చేసిన రామకృష్ణకు స్థానిక టిడిపి నాయకులు సత్యారి ధనంజయ రెడ్డి, మాజీ సర్పంచ్ బాలసుబ్రహ్మణ్యం, శేషాద్రి, నాజర్, చేజు, మహిళలు భాను, రూప ఘన స్వాగతం పలికారు. కళ్యాణ వెంకన్న స్వామిని దర్శనం కోసం స్థానిక టిటిడి అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం స్వామి తీర్థప్రసాదాలను రామకృష్ణకు అందించారు.

ప్రెస్‌క్లబ్ ఎన్నికల విజేతలకు శుభాకాంక్షలు

అన్నా రామచంద్ర యాదవ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి ప్రెస్ క్లబ్ ఎన్నికలలో గెలిచిన ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు తెలుపుతున్నానని అఖిల భారతీయ యాదవ మహాసభ జాతీయ ఉపాధ్యక్షులు అన్నా రామచంద్ర యాదవ్ అన్నారు. శనివారం తిరుపతి నగర పరిధిలోని కేటీ రోడ్డులోని కార్యాలయంలో ప్రెస్ క్లబ్ సంయుక్త కార్యదర్శిగా ఎన్నికైన విజయ్ యాదవ్‌ను ఘనంగా సన్మానించారు. ప్రెస్ క్లబ్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ గెలుపు ఓటములను సమానంగా స్వీకరించి తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అన్నా అనిత యాదవ్, శంకర్ యాదవ్, ఉదయ్ యాదవ్, మునియాదవ్, భాస్కర్ యాదవ్ పాల్గొన్నారు.

ముగిసిన వైపై శిక్షణ

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్‌పిఎమ్‌విపి వైపై టాక్ సమిష్ట, యుఎన్ ఏపి సిఐసిఐ సంయుక్తంగా నిర్వహించిన 'డిజిటల్ మార్పు ద్వారా మహిళా వ్యాపారులను శక్తివంతం చేయడం' శిక్షణ కార్యక్రమం ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో శనివారం ముగిసింది. ఈ సందర్భంగా వీసి ఆచార్య వి ఉమ మాట్లాడుతూ మహిళా వ్యాపార వేత్తల కోసం ఈ శిక్షణ నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ రజని, అధ్యాపకులు, పరిశోధకులు, వ్యాపార వేత్తలు పాల్గొన్నారు.

తీరు మార్చుకోకుంటే సహించేది లేదు..

సత్యనారాయణరెడ్డిపై టిడిపి నాయకుల ఆగ్రహం

ప్రజాశక్తి - పెళ్లకూరు: టిడిపి సీనియర్ నాయకుడు గంగా ప్రసాదు, ముఖ్యమంత్రి చంద్రబాబును విమర్శించే స్థాయి వైసిపి నాయకుడు, ఎన్‌డిసిసిబి మాజీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డికి లేదని టిడిపి నాయకుడు బెన్ని, టిడిపి మండల ప్రసిడెంట్ సంచి కృష్ణయ్య పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ సత్యతనారాయణరెడ్డి తీరు మార్చుకోకుంటే సహించేది లేదని హెచ్చరించారు. ప్రవర్తన మార్చుకోకుంటే తామేమిటో చూపిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో టిడిపి సీనియర్ నాయకుడు రాజారెడ్డి, ఓ శేఖర్ నాయుడు, ప్రసాద్ నాయుడు, మల్లికార్జున్ రెడ్డి, మాధవరెడ్డి, యుగంధర్, సిద్దు నాయుడు, గురవయ్య పరుశురాం, నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హరిప్రసాద్ హత్యకేసులో 14 మంది అరెస్ట్


మాట్లాడుతున్న పోలీసు అధికారులు

ప్రజాశక్తి - చిల్లకూరు: చిల్లకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని నాంచారంపేట, ముత్యాలపాడు గ్రామాల్లో ఈ నెల 21, 22 తేదీల్లో చోటుచేసుకున్న సంఘటనలో టిడిపి నాయకుడు మల్లారపు హరి ప్రసాద్ హత్యకు గురైన సంఘటన విదితమే. ఈ హత్య కేసుకు సంబంధించి చిల్లకూరు పోలీస్ స్టేషన్ వివిధ సెక్షన్ల కింద మూడు కేసులు, ఒక హత్య కేసు నమోదు చేశారు. ఈ కేసులను వివిధ కోణాల్లో దర్యాప్తు చేసిన పోలీసులు 14 మందిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ ఈ నెల 21, 22వ తేదీల్లో పెత్తందారులు కొంతమంది,వైసిపి నాయకులు ప్రత్యర్థులుగాను, వర్గీకరణను కుట్రపన్ని నాంచారంపేట హరిజన వాడకి చెందిన కొంత మందితో కలిసి, నాంచారంపేట అరుంధతీవాడకు చెందిన కాలయ్య , హరి ప్రసాదులు నిద్రిస్తున్న బంజరు దొడ్డిపై దాడి చేసి, ఇంటి ముందున్న మోటార్ సైకిల్‌ను పెట్రోల్ పోసి కాల్చి వేశారు. వారు నిద్రిస్తున్న ఇంట్లోకి పెట్రోల్ బాటిల్ విసిరి నిప్పంటించి వారిపై హత్యాయత్నం చేయగా, ఆ మంటలకు తట్టుకోలేక కాలయ్య , హరి ప్రసాదులు బయటకు రావడంతో వారి పై నిర్దాక్షిణ్యంగా కత్తులతో దాడి చేసి దుర్గాప్రసాదిని హత్య చేశారు. కాలయ్య పై హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా గూడూరు డీఎస్పీ వివి రమణ కుమార్ కు అందిన సమాచారంతో ఈ నెల 25వ తేదీ చిల్లకూరు మండల పరిధిలోని చింతవరం-కోట రోడ్డులో వుండగా నిందితులను అరెస్ట్ చేశామని తెలిపారు. చిల్లకూరు మండల పరిధిలోని ముత్యాలపేట వద్ద వున్న ఎంపిపి గౌడౌన్ వద్ద హత్య కేసులో మరో ఏడుగురిని నిందితు లను అరెస్ట్ చేశామని తెలిపారు. నేరానికి ఉపయోగించిన కత్తులు, వాహనాన్ని స్వాధీ నం చేసుకున్నారు. తిరుపతి ఎల ఎండ్ ఆర్డర్ అదనపు ఎస్‌పి కె రవిమనోహరాచారి నేతృత్వంలో గూడూరు ఎస్‌డిపివో వివి రమణ కుమార్, నాయుడుపేట ఎస్‌డిపివో చెంచు బాబు, గూడూరు రూరల్ సిఐ కిశోర్ బాబు, వాకాడు సిఐ హుస్సేన్ బాష, సూళ్లూరుపేట సిఐ మురళి కృష్ణ, చిల్లకూరు యస్ఐ రమేష్ బాబు, ఇతర అధికారులతో వివిధ బృందాలుగా ఏర్పాటు చేసి కేసులో నిందితులను అరెస్టు చేశారు.

పాఠశాల ఎదుటే వాహనాల పార్కింగ్

- విద్యార్థులకు ఇబ్బందులు
- స్పందించని విద్యాశాఖాధికారులు


విద్యాధికారులు స్పందించాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలో ఎంపీపీ మెయిన్ స్కూల్, పక్కనే అంగన్వాడీ కేంద్రం, భవిత స్కూలు ఉన్నాయి. ఆ పాఠశాల ఎదుట వివిధ రంగాల్లో పనిచేసే వ్యక్తులు ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. వాహనాల వల్ల విద్యార్థులు తిరగాలన్నా ఆటలు ఆడుకునేందుకు ఇబ్బందికరంగా ఉందని వలసార్లు విద్యార్థుల తల్లిదండ్రులు విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా ఎలాంటి స్పందన లేదని, నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని వాపోయారు. వాహనాలు పార్కింగ్ చేయడమే కాకుండా పాఠశాల పక్కనే పూల, పండ్ల వ్యాపారం కూడా చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. పువ్వులు కొనుగోలు చేసేందుకు వచ్చే వారు కూడా పాఠశాల ముందు పార్కింగ్ చేసి వెళ్ళి తున్నారని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు పలుసార్లు పూల వ్యాపారులను చెప్పినా వారు పట్టించుకోలేదని వాపోయారు. 'ఇలా ఉంటే విద్యార్థులు ఎలా చదువుకోవాలి? ఎలా ఆటలాడుకోవాలి?' అని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత విద్యాశాఖ అధికారులు స్పందించి మెయిన్ స్కూల్ ఆవరణలో వాహనాలు పార్కింగ్ చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని, లేకుంటే పెద్ద ఎత్తున పాఠశాల రోడ్డుపై ఆందోళన చేపడతామని పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు హెచ్చరించారు.

పలుసార్లు పాఠశాలలో ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేయకూడదని, విద్యార్థులకు ఇబ్బందిగా ఉందని చెప్పినా పట్టించు కోకుండా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. దీనిపై విద్యాశాఖాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి. **- మురళీకృష్ణ, ప్రధానోపాధ్యాయులు.**

ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: వైద్య విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా వుండాలని జడ్జి ఎం గురునాథ్ పేర్కొన్నారు. ఎస్వీ వైద్య కళాశాల విద్యార్థులకు ర్యాగింగ్ అనర్థాలపై శనివారం అవగాహన నిర్వహించారు. స్థానిక ఎస్వీఎంసీ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి తిరుపతి జిల్లా మూడవ అదనపు సివిల్ జడ్జి ఎం గురునాథ్, ప్రిన్సిపల్ సీనియర్ జడ్జి టి విజయ సారధి రాజు, అదనపు సీనియర్ జడ్జి ఏ సునీత రాణి, రిటైర్డ్ జడ్జి రాజీవ్, స్టేట్ మెంటల్ హెల్త్ ఛైర్మన్, ఎస్ వి వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్జి ఎం గురునాథ్ మాట్లాడుతూ ర్యాగింగ్‌కి దూరంగా ఉంటూ వైద్య విద్యను గొప్పగా అభ్యసించాలి..' అనే నినాదంతో పేద రోగులకు మెరుగైన వైద్యం అందించి, గొప్ప వైద్యులుగా ఎదగాలని ఈ సందర్భంగా ఆయన పిలుపు నిచ్చారు. సమాజంలో వైద్యులకు ప్రత్యేకమైన గుర్తింపు ఎప్పటికీ వుంటుందని చదువుకొనే రోజుల్లో ర్యాగింగ్‌ను ప్రోత్సహించడం, ర్యాగింగ్ చేయడం తప్పేనన్నారు. ర్యాగింగ్‌పై కఠినమైన చట్టాలు గురించి తెలిపారు. అనంతరం యాంటి ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల అధిపతులు, వైద్యులు డాక్టర్ రామాంజనేయులు, డిప్యూటీ సి ఎస్ఆర్ఎంఓ, వైద్య అధ్యాపకులు, వైద్య విద్యార్థులు, ఎస్ వి వైద్య కళాశాల పిఆర్ఓ వీర కిరణ్ పాల్గొన్నారు.

ఆయుధాలపై అవగాహన


ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు ఎస్‌పి ఎల్ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పోలీసులు పలు రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా స్థానిక పోలీస్ మైదానంలో శనివారం ఓపెన్ హౌస్(ఆయుధాల ప్రదర్శన) నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్‌పి అడ్మిన్ వెంకట్రావు పోలీసులు విధి నిర్వహణలో వినియోగించే ఆయుధాలు, సాంకేతిక పరికరాల గురించి, వాటిని పోలీసులు ఏ సందర్భంలో ఎలా ఉపయోగిస్తారో విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాలల, కళాశాల విద్యార్థులకు, నిపుణుల పర్యవేక్షణలో 'రోల్ ఆఫ్ యూత్ ఇన్ ప్రివెన్షన్ ఆఫ్ సైబర్ క్రైమ్' అనే అంశంపై వ్యాసరచన పోటీలు, బృంద చర్చల పోటీలు నిర్వహించారు. పోలీసులకు, పోలీసుల పిల్లలకు 'ఛాలెంజెస్ టు పోలీస్ ఇన్ ద ప్రజెంట్ ఎన్విరాన్మెంట్' అనే అంశంపై వ్యాసరచన పోటీలు, బృంద చర్చలు పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ చూపిన మొదటి ముగ్గురికి ప్రోత్సాహక బహుమతులను ప్రదానం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్ పి శ్రీనివాసరావు, డీఎస్పీలు శ్రీలత, చిరంజీవి, ఆర్ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది, పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

కుక్కల బెడద

- ప్రమాదాల బారిన వాహన చోదకులు
- వీధుల్లో తిరగాలన్నా భయాందోళన


వీధుల్లో సంచరిస్తున్న శునకాలు

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలంలోని మడిబాక పంచాయతీ రాజుల కండ్రిగ ఎస్టీ కాలనీలో కుక్కలు భయాందోళనకు గురి చేస్తున్నాయి. కుక్కల సంచారం వల్ల ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. రాజులకండ్రిగ గ్రామ వీధుల్లో ఎక్కడపడితే అక్కడ గుంపులు గుంపులుగా కుక్కలు సంచరిస్తూ ఆ దారిన వెళ్లే వారిపై దాడులు చేస్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీధుల్లో స్వేచ్ఛగా తిరగలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఎండి పుత్తూరు పశుసంవర్ధక శాఖలో పనిచేస్తున్న వాణి గత శుక్రవారం సాయంత్రం కుక్కలు అడ్డు రావడంతో స్కూటీ నుండి కింద పడి ప్రమాదానికి గురై గాయపడింది. కుక్కల సంచారంపై పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సమాచార హక్కు చట్టం ప్రజలకు వజ్రాయుధం



మాట్లాడుతున్న మండల వ్యవసాయ అధికారి సుధాకర్‌రెడ్డి

ప్రజాశక్తి -రామచంద్రాపురం: సమాచార హక్కు చట్టం ప్రజలకు వజ్రాయుధం అని మండల వ్యవసాయ అధికారిణి స్రవంతి అన్నారు. శనివారం మండలంలోని గంగిరెడ్డిపల్లి గ్రామ రైతు సేవా కేంద్రంలో సమాచార హక్కు చట్టంపై రైతులకు, మండల, గ్రామ అధికారులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ చట్టంలో భాగంగా దరఖాస్తుదారుడు కోరిన సమాచారాన్ని 30 రోజుల కాల పరిమితి లోగా సంబంధిత శాఖ సమాచారం ఇవ్వాలని, సకాలంలో ఇవ్వకుంటే పై స్థాయి అధికారులకు అప్పీల్ చేసుకోవచ్చన్నారు. పూర్తి స్థాయిలో సమాచారం ఇవ్వకుంటే దరఖాస్తుదారుడు సమాచార హక్కు కమిషన్ కు ఫిర్యాదు చేస్తే కమిషనర్ విచారణ చేసి సమాచారాధికారికి జరిమానా, క్రమశిక్షణ చర్యలు తీసుకోకునేలా ఆదేశాలిస్తారన్నారు. ఈ చట్టంపై ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమం లో రైతు సేవ కేంద్రాల వ్యసాయ, ఉద్యాన సహాయకులు, ప్రకృతి వ్యసాయ సిబ్బంది. రైతులు పాల్గొన్నారు.

యర్రావారిపాలెం: సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయ అధికారి ఖాదర్ బాష తెలిపారు. నెరబైలు పంచాయతీలోని చింతకాయల హరిజనవాడ లో శనివారం సమాచార హక్కు చట్టం పై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బాలసుబ్ర హ్మణ్యం, హార్టికల్చర్ ఆఫీసర్ శివకుమారి,సెక్రటరీలు రైతు సేవా సిబ్బంది, సచివాలయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి రూరల్: సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని శ్రీకాళహస్తి మండల వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శనివారం సమాచార హక్కు చట్టం పై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంపై పూర్తిగా అవగాహన కల్పించి వివిధ సెక్షన్లు వివరించారు. ప్రజలు, గ్రామ స్థాయి అధికారులు అవగాహన పెంచుకొని అవసరమైన సమాచారం ప్రభుత్వ అధికారుల, సంస్థల నుండి పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ ఉద్యాన వన సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: సమాచారం హక్కు చట్టంపై ప్రతి పౌరుడు అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయ అధికారిని భారతి అన్నారు. శనివారంలో వ్యవసాయ శాఖ కార్యాలయంలో వ్యవసాయ శాఖ సిబ్బంది , ప్రకృతి వ్యవసాయ సిబ్బంది డీలర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షేత్రస్థాయి అధికారులు సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండి పౌరులు అడిగిన సమాచారాన్ని అందించాలని బాధ్యతగా అందించాలని తెలిపారు.

శాస్త్రీయ విధానంలో పంటలు సాగుచేయాలి

కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రామ్ కుమార్


మాట్లాడుతున్న రామ్‌కుమార్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : శాస్త్రీయ, సాంకేతిక విధానంలో పంటలు సాగు చేసి పంటలు సాగు ఖర్చు లు తగ్గించుకోవాలని రైతులకు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రామ్ కుమార్ సూచించారు. స్థానిక రాస్ కార్యాలయంలో రైతులకు శనివారం అవగాహన నిర్వహించారు. ఈ సదస్సుకు 90 మంది రైతులు హాజరై పంటలు సాగులో అనుమానాలు నివృత్తి చేసుకున్నారు. లోతు ఎక్కువగా దుక్కులు దున్ని భూసార పరీక్షలు ఆధారంగా పంటలు సాగు చేసుకుని ఖర్చులు తగ్గించుకుని ఆదాయం పెంచుకోవాలని, ఎరువులు వినియోగం, అధిక దిగుబడి ఇచ్చే పంటలు సాగు, సమగ్ర సస్య రక్షణ గురించి రైతులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లుగా రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు పంటలు సాగు పద్ధతులు, సాంకేతిక, శాస్త్రీయ విధానంపై అవగాహన కల్పిస్తోందన్నారు. రసాయనిక ఎరువులు వినియోగించడం వల్ల కలిగే నష్టాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కృష్ణరామాపురం, నాగరాజు కుప్పం, టివి కండ్రిగ, ముడిపల్లి పరిసర ప్రాంతాల రైతులు, రాస్ అధికారి రవి, ప్రకాష్, మణి, శేఖర్ పాల్గొన్నారు.

క్రైం న్యూస్

బంగారం, నగదు అపహరణ

ప్రజాశక్తి - ఓజిలి: పట్టపగలే దొంగలు ఓ ఇంట్లోకి ప్రవేశించి నగదుతో పాటు బంగారాన్ని అపహరించడంతో స్థానిక గ్రామస్తులు ఒక్కసారిగా ఉలికిపాటుకు గురైన సంఘటన మండల పరిధిలోని సగుటూరు గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీ స్వప్న కథనం మేరకు ఓజిలి మండలంలోని సగుటూరు గ్రామానికి చెందిన వర్దినేని నాగమణి అదే గ్రామంలో నివసిస్తున్న తన అక్క ఇంటికి శెట్టి తిరిగి ఇంటికి వచ్చి చూడగా గుర్తు తెలియని దుండగులు తాళాలు వేసిన ఇంటి తలుపులను బద్దలు కొట్టి బీరువాలు తెరిచి అందులో దాచి ఉంచిన 21 సవర్ల బంగారం , 26 వేల రూపాయలు నగదును దోచుకుపోయారు. బాధితురాలు నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఓజిలి ఎస్‌ఐ కె.స్వప్న తన సిబ్బందితో పాటు క్లూస్ టీమ్ తో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్రచందనం స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): శేషాచలం అటవీ పరిధి అన్నమయ్య జిల్లా సానిపాయ సమీపంలోని అటవీ ప్రాంతంలో 26 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని, నలుగురు స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. టాస్క్ ఫోర్స్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కడప సబ్ కంట్రోల్ ఆర్ఐ చిరంజీవులుకు చెందిన ఆర్ఎస్ఐ పీ నరేష్ బృందం స్థానిక అటవీ శాఖ సిబ్బందితో కలసి సానిపాయ-రాయచోటి రోడ్డు మార్గంలో తనిఖీలు నిర్వహించారని అధికారులు తెలిపారు. బొల్లువాండ్ల పల్లి రోడ్డు వద్ద కొందరు వ్యక్తులు కనిపించగా వారిని పట్టుకునేందుకు యత్నించగా పారిపోయే ప్రయత్నం చేశారన్నారు. పారిపోతున్న వారిలో నలుగురిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేశామన్నారు. పట్టుబడ్డ ఈ నలుగురు తమిళనాడు కళ్లకురిచ్చి, సేలం జిల్లాకు చెందినవారిగా గుర్తించామన్నారు. టాస్క్ ఫోర్స్ పోలీస్ కేసు నమోదు చేసి సీఐ సురేష్ కుమార్ దర్యాప్తు చేస్తున్నారన్నారు.

యర్రావారిపాలెం: ముందస్తు రహస్య సమాచారంతో ఎర్రచందనం దుంగలతో పాటూ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని ఫారెస్టు అధికారులు తెలిపా రు. భాకరాపేట అటవీశాఖ క్షేత్రాధికారి ఎన్ వెంకటరమణ కథనం మేరకు.. భాకరాపేట అటవీ శాఖ అధికారులకు అందిన రహస్య సమాచారం మేరకు శుక్రవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో బోడేవాండ్లపల్లి పెట్రోల్ బంకు పరిసర ప్రాంతాల నుండి రొంపిచర్ల, పులిచెర్ల మీదుగా కారులో ఎర్రచందనం అక్రమంగా రవాణా చేస్తుండగా ఫారెస్ట్ అధికారులు కారును ఆపారు. ఆపకుండా వేగంతో వెళ్లిపోయారు. అనుమానం వచ్చి ఫారెస్ట్ అధికారులు కారును వెంబడించగా అత్యంత వేగంతో గానుగచింత, రొంపిచర్ల రోడ్డు మార్గంలో దూసుకెళ్లడంతో వెంబడించామని, బెస్తపల్లి వద్ద స్మగ్లర్లు కారు నుండి దూకి పారిపోయారన్నారు. పారిపోయిన స్మగ్లర్లను పట్టుకోవడానికి యత్నించగా చీకటి పడడంతో స్మగ్లర్లు దొరక్కుండా పారిపోయారని అటవీశాఖ సిబ్బంది తెలిపారు. కారుతో సహా 14 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నామని వాటి విలువ సుమారు 12 లక్షల రూపాయలు ఉంటుందని భాకరాపేట అటవీశాఖ క్షేత్రాధికారి ఎన్ వెంకటరమణ తెలిపారు. ఈ దాడిలో ఎఫ్ఎస్ఓ ప్రదీప్ కుమార్, ఎఫ్‌బిఓలు, రాజేష్ కుమార్, ప్రదీప్ చంద్, నిఖిల్, శంకర్ , శ్రీనివాసులు, ప్రభుతేజ, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారని వారు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి సజీవ దహనం

ప్రజాశక్తి -పెళ్లకూరు: పెళ్లకూరు మండలంలోని టెంకాయ తోపు గ్రామం వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి సజీవ దహనం అయ్యాడు. తిరపతి నుండి నాయుడుపేట వైపు వెళుతున్న కంటైనర్ (మైసూరు నుంచి కలకత్తాకు వెళుతోంది) లారీని ఓవర్‌టేక్ చేయబోయింది. ఈ క్రమంలో కాకినాడకు వెళుతున్న జ్యూస్ లారీని వెనుక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో కంటైనర్ క్యాబిన్‌లో మంటలు చెలరేగి డ్రైవర్ ఎండి సర్ఫరాజ్ (18) అక్కడికక్కడే సజీవ దహనం అయ్యాడు. మృతునికి తల్లి తారాబేగం, ముగ్గురు అక్కలు ఉన్నారు. ముగ్గురు అక్కల్లో ఒకరికి సొంత లారీ ఉండడంతో సర్ఫరాజ్ డ్రైవర్‌గా ఉంటున్నాడని సమాచారం. కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి వస్తే పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

విఎస్ఆర్‌లో యానిమల్ డే

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రెండవ పట్టణ పరిధిలోని వియస్ఆర్ పాఠశాలలో విద్యార్థులకు జంతువుల విశిష్టత, వాటి రూపురేఖలను పిల్లలకు పరిచయం చేసేందుకు పాఠశాలలో యానిమల్ డేను శనివారం నిర్వహించారు. ఇందుకు విద్యార్థులు వివిధ రకాల జంతువుల వేషధారణలతో వచ్చారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థులలో సృజనాత్మక శక్తి, ఉత్సాహం పెరుగుతాయన్నారు. ఒక్క చదువులోనే కాకుండా అన్ని రకాల కార్యక్రమాల వారికి అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. దీనికి సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బాలకృష్ణ రాజు కరస్పాండెంట్ అన్నపూర్ణ , ప్రిన్సిపాల్ శాంత కుమార్ , ఉపాధ్యాయిని , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంజి మాధవయ్యకు ఘన సన్మానం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి, వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్యను తడుకు సర్పంచ్ బొబ్బిలి ఆధ్వర్యంలో వేణుగోపాలపురం, టిఆర్ కండ్రిగ, ఇతర గ్రామానికి చెందిన నాయకులు, యువకులు శనివారం ఘనంగా సన్మానించారు. మాధవయ్య మరెన్నో రాష్ట్రస్థాయి పదవులను అలంకరించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించిన తడుకు పంచాయతీ టిడిపి నాయకులు సి నరసింహయాదవ్, ఎం రవి, బి దేవా, కె కేశవ, ఎ విజయ్ కుమార్, ఎం సాయి, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కమిటీలో మించల ప్రదీప్

ప్రజాశక్తి - తిరుపతి సిటి: జాతీయ షెడ్యూల్ కులాల సంక్షేమ పథకాల అమలు మండలి సభ్యుడిగా తిరుపతికి చెందిన మించల ప్రదీప్‌ను నియమిస్తూ ఆ సంస్థ సంయుక్త కార్యదర్శి వి.ప్రసాద్ ఉత్తర్వుల ద్వారా తెలిపారు. గతంలో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఏపీ సభ్యుడిగా రెండు పర్యాయాలు, ఆహార భద్రత, తనిఖీ, నాణ్యత పంపిణీ, మంత్రిత్వ శాఖలో మించల ప్రదీప్ పని చేశారు. జాతీయ స్థాయిలో పనిచేసే ఈ కమిటీలో మించల ప్రదీప్ రెండేళ్ల పాటు కొనసాగుతారని అయన తెలిపారు. ఈ సందర్భంగా మించల ప్రదీప్ మీడియాతో మాట్లాడుతూ బహుజనులు అనాదిగా అధికారానికి దూరమై, విద్యా, వైద్య, క్రీడా, ప్రైవేట్, వ్యాపారంలో వెనుకబడి ఇప్పటికీ పేద బతుకులు బతుకుతున్నారని, అలాంటివారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ ఫలాలు ద్వారా, దేశ అభివృద్ధికి తోడ్పడాలని మించల ప్రదీప్ కోరారు.

డిసెంబర్ 22,23న గణిత శాస్త్రంపై జాతీయ సదస్సు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని గణితశాస్త్ర విభాగం డిసెంబర్ 22-23వ తేదీలలో నిర్వహించే జాతీయ సదస్సు బ్రోచర్ ను ఇన్‌ఛార్జ్ ఉపకులపతి ఆచార్య సిహెచ్ అప్పారావు శనివారం సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆఫీసులో గణిత శాస్త్ర విభాగాధిపతి ఆచార్య సి. జయసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జాతీయ సదస్సు బ్రోచర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో డిసెంబర్ 22, 23వ తేదీలలో నిర్వహించే జాతీయ సదస్సు "మ్యాథమెటిక్స్ అండ్ ఇట్స్ అప్లికేషన్స్ - 2024" (ఎన్సీఎంఐఏ 2024) అనే అంశంపై ఉంటుందన్నారు. విద్యార్థులు పరిశోధకులు అధ్యాపకులు జాతీయ సదస్సులో పాల్గొని పరిశోధనలు సమాజానికి ఉపయోగపడేలా తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు పాల్గొన్నారు.

ప్రతి హామీ నెరవేరుస్తా..

పల్లె పండుగలో ఎమ్మెల్యే నాని


అభివృద్ధి కార్యక్రమ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాని

ప్రజాశక్తి- యర్రావారిపాలెం: ప్రతి హామీ నెరవేరుస్తానని ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని నెరబైలు, చింతగుంట, పంచాయతీలలో రూ.2 కోట్ల70 లక్షల 80 వేలతో సిసి రోడ్లు, డ్రైనేజ్ కాలువల నిర్మాణం, పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే పులివర్తి శనివారం శంకుస్థాపనలు చేశారు. దళితవాడలో సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా గ్రామస్తుల కోరిక మేరకు ప్రతి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గ్రామాలకు జీవం పోస్తూ పెద్ద మొత్తంలో నిధులు కేటాయించారన్నారు. వీధిలైట్లు, తాగునీరు, డ్రైనేజీ కాలువలు, శ్మశానం, కమ్యూనిటీ హాలు, బస్సు సౌకర్యం కల్పించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని ప్రజలకు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, అధికారులు, మహిళలు, యువత అధికారులు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదు ప్రారంభం

ప్రజాశక్తి -రామచంద్రాపురం(పాకాల): చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం పదిపుట్లబైలు పంచాయతీలోని కొండకిందపల్లిలో టిడిపి సభ్యత్వ నమోదును చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి, టిడిపి మహిళా నేత పులివర్తి సుధా రెడ్డి స్థానిక నాయకులతో కలిసి శనివారం ప్రారంభించారు. మొదట లక్ష రూపాయలు కట్టి శాశ్వత సభ్యత్వాన్ని పులివర్తి సుధారెడ్డి నమోదు స్వీకరించారు. ఈ కార్యక్ర మంలో మండల టిడిపి నాయకులు, నాయకురాళ్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : గూడూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టిడిపి సభ్యత్వ నమోదును ఎమ్మెల్యే సునీల్ కుమార్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.


పుత్తూరు టౌన్ : పుత్తూరు మున్సిపాల్టీ పరిధిలోని 6వ వార్డు గేటు పుత్తూరు వినాయక గుడి వద్ద టిడిపి సభ్యత్వ నమోదును పుత్తూరు పట్టణ టిడిపి అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్ శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు మున్సిపల్ మాజీ ఛైర్మన్లు కరుణాకరన్, యుగంధర్, రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు డిఎస్‌గణేష్, మైనార్టీ నాయకులు నబీ మస్తాన్, అరుణాచలం రెడ్డి, మెకానిక్ శివ, బాబు, జిల్లా టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు ఆర్ మాధవ నాయుడు, టిడిపి నాయకులు డిజి ధనపాల్, ఏలుమలై రెడ్డి, అశోక్, కేశవా, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

పుత్తూరు రూరల్ మండలం గోపాలకృష్ణాపురంలో టిడిపి సభ్యత్వ నమోదును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్, పుత్తూరు మాజీ ఎంపీపీ గంజి మాధవయ్య శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు రూరల్ టిడిపి ప్రధాన కార్యదర్శి ఎ బాలాజీ, టిడిపి నాయకులు గంగయ్య, హేమంత్, హరిగోపాల్, జనసేన గోవర్ధన్ పాల్గొన్నారు.

యర్రావారిపాలెం: మండలంలోని నెరబైలులో టిడిపి సభ్యత్వ నమోదును ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రారంభించారు. శనివారం ఉదయం తలకోన సిద్దేశ్వర స్వామి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. తలకోన ఆలయ అభివృద్ధి, కోనేరు నిర్మాణం, మాస్టర్ ప్లాన్‌పై అధికారులతో చర్చించారు. అనంతరం నెరబైలు పంచాయతీకి విచ్చేసిన ఎమ్మెల్యే టిడిపి సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు , అభిమానులు పాల్గొన్నారు.

నాయుడుపేట: నాయుడుపేట టిడిపి కార్యాలయంలో టిడిపి సభ్యత్వ నమోదును ఎమ్మెల్యే విజయశ్రీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, నాయుడుపేట మాజీ ఏఎంసీ ఛైర్మన్ శిరసనం భేటీ విజయభాస్కర్ రెడ్డి, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, రఫీ, నెలవల రాజేష్, ఓజిలి మండల అధ్యక్షుడు విజయ నాయుడు, పెళ్లకూరు మండల అధ్యక్షులు సంచి కృష్ణయ్య పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: కాటూరు పంచాయతీలో టిడిపి సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో టి కన్నయ్యనాయుడు, సుధాకర్ నాయుడు, చెంచురామానాయుడు, మధు నాయుడు, పాల్గొన్నారు.



శ్రీకాళహస్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి: వంద రూపాయలు సభ్యత్వ రుసుము కట్టి టీడీపీ కుటుంబంలో చేరడం ద్వారా రూ.5 లక్షల ప్రమాద బీమా పొందచ్చని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా శనివారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. పేద కుటుంబంలోని విద్యా వైద్యం కోసం ఆర్థిక సహాయం పొందవచ్చని ప్రజలకు వివరిస్తూ సభ్యత్వ నమోదు చేయాలని తెలిపారు. సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికీ టీడీపీ అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు ప్రారంభించారు.

తిరుపతి స్మార్ట్ సిటీ ఈఈ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- తిరుపతి టౌన్:

తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా చంద్ర శేఖర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. కమిషనర్ ఎన్ మౌర్య స్మార్ట్ సిటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా చంద్రశేఖర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన గతంలో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఉన్నారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు ఆయన హయాంలోనే ఎక్కువ చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా చంద్రశేఖర్ చిత్తూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఇటీవల బదిలీ అయ్యారు. తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్‌కు ఎగ్జిక్యూటివ్ లేకపోవడంతో చూడా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా ఉన్న చంద్రశేఖర్‌కు అదనపు బాధ్యతలు ఇస్తూ స్మార్ట్ సిటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా కేటాయించారు.